క్లుప్తంగా

భారీ వర్షాలతో నీటమునిగిన పంటలు


ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది

బొమ్మనహాళ్: మండలంలో మూడో రోజూ భారీ వర్షం కురిసింది. మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, దేవగిరి, బండూరు, కొలగానహళ్లి, కల్లుదేవనహళ్లి, ఎల్‌బీ నగర్, ఉప్పరహాళ్, కృష్ణాపురం, లింగదహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి ఏకదాటిగా గంటకు పైగా కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో 29.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది, కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, కందేపల్లి వద్ద వేదావతి వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు నీట మునిగిపోయాయి. వరి, పత్తి, మిరప, మొక్కజొన్న పంటల్లోకి వర్షపునీరు చేరింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరకు చెందిన అశోక్ (28) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.వివరాలు.. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను గురువారం మద్యం మత్తులో ఎక్కాడు. ఒక్కసారిగా కిందకు దూకాడు. దీంతో కాళ్లుచేతులు, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఒక్కగా నొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి లక్ష్మక్క కన్నీటి పర్యంతమైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గం మున్సిపల్ కమిషనర్‌గా వంశీకృష్ణ భార్గవ్



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.వంశీ కృష్ణ భార్గవ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పెనుకొండలో కమిషనర్‌గా పని చేస్తున్న ఈయన్ను బదిలీపై కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా పంపారు. నూతన కమిషనర్ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్‌రెడ్డి



రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్‌గా వి.దివాకర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పని చేస్తున్న పి.కిశోర్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేశారు. కాగా దివాకర్‌రెడ్డి గతంలో ఇక్కడ కమిషనర్‌గా పని చేస్తూ ఎన్నికల బదిలీల్లో భాగంగా కర్నూలు జిల్లా గూడూరుకు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మారిన తర్వాత దివాకర్‌రెడ్డి మళ్లీ రాయదుర్గం మున్సిపాలిటీకే బదిలీపై వస్తున్నారు.

నేడు గ్రామసభలు

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం తెలిపారు. గోవిందవాడ, నేమకల్లు, శ్రీధరఘట్ట, గ్రామాల్లో ఉదయం 10 గంటలకు, బండూరు, బొల్లనగుడ్డం, బొమ్మనహాళ్, డి.హొన్నూరు, ఏలంజి, లింగదహాళ్, ఉంతకల్లు గ్రామాల్లో ఉదయం 11 గంటలకు, కురువల్లి, గోనేహాళ్, ఉప్పరహాళ్, గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంటకు, హరేసముద్రం, కల్లుహోళ, కొలగానహళ్లి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటలకు, ఉద్దేహాళ్, సిద్దరాంపురం, సింగానహళ్లి గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేషన్ సరుకులు సకాలంలో అందజేయాలి


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: మండలంలోని లబ్ధిదారులకు రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందజేయాలన్నారు. కొంతమంది డీలర్లు గోడౌన్ నుంచే బియ్యం తూకాలు తక్కువ వస్తున్నాయని ఆయనకు తెలియజేశారు. వారితో మాట్లాడి వాటిని సరిచేస్తామన్నారు. ఎక్కడాగానీ అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ సుజాత, ఆర్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

అన్నదాతల ఆశలకు గండి


చెరువు కట్ట తెగిపోవడంతో వృథాగా వెళ్తున్న వర్షపు నీరు

- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం
- భారీ వర్షాలకు తెగిన ముద్దినాయనపల్లి చెరువు కట్ట
- పూర్తిగా తెగిపోయిన వైనం
- వృథాగా పోయిన వర్షపునీరు
- ఆరు గ్రామాల ఆయకట్టు రైతులకు నష్టం


తెగిపోయిన చెరువు కట్ట

కళ్యాణదుర్గం: భారీ వర్షాలు కురిస్తే చెరువు నిండుతుంది.. ఆయకట్టు సాగవుతుంది.. ఈ ప్రాంతమంతా పచ్చగా కళకళలాడుతుందని అన్న దాతలు ఆశపడ్డారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో రైతుల ఆశలకు గండిపడింది. నాలుగైదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ముద్దినాయనపల్లి చెరువు కట్ట తెగిపోయింది. వర్షపునీరంతా వృథాగా బయటకు వెళ్తోంది. వందల ఎకరాల ఆయకట్టుకు అందాల్సిన నీరంతా వృథాగా వెళ్లిపోయింది. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోని ఇరిగేషన్ అధికారులపై రైతులు మండిపడుతున్నారు.

కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి చెరువు తెగిపోయింది. ఐదారు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి పైభాగం నుంచి అధికంగా వరద నీరు చెరువులోకి వచ్చి చేరుతోంది. ఇరిగేషన్ అధికారుల ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలం కావడంతో చెరువుకు గండి పడింది. దీంతో వరద నీరు మొత్తం చెరువు నుంచి వృథాగా బయటికి వెళ్లిపోయింది.

ఆరు గ్రామాల రైతులకు నష్టం:

ముద్దినాయనపల్లి కళ్యాణదుర్గం మండలంలోని అతిపెద్ద విస్తీర్ణం కలిగిన పంచాయతీ గ్రామం. గ్రామంలో 1,535 మంది రైతులుండగా సుమారు 4 వేల ఎకరాల సాగు విస్తీర్ణం జరుగుతోంది. ఊరి చెరువుపై ఆధారపడి ముద్దినాయనపల్లి, కాపర్లపల్లి, దిగువ తండా, ఎగువ తండా, వెంకటంపల్లి, కొండాపురం గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచి చెరువు కింద ఆయకట్టు 150 ఎకరాలు ఉంది. చెరువుకట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగాపోయిందని, గ్రామాల పరిధిలో బోరుబావుల్లోకి నీరు పెరగదని రైతులు అంటున్నారు.

వృథాగా వర్షపు నీరు :

ముద్దినాయనపల్లి చెరువుకు ఐదారు రోజుల్లోనే సుమారు ఏడాదికి సరిపడా సాగునీరందేలా వర్షపు నీరు వచ్చి చేరింది. అయితే చెరువుకు గండిపడిన విషయాన్ని ఒక్కరోజు ముందుగానే గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీన్ని నిర్లక్ష్యంగా తీసుకున్న ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల వరకు అటు వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో


తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన ఇరిగేషన్ అధికారులు


తెగిపోయిన చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో గండిపడిన ప్రాంతంలో చెరువు కట్ట మొత్తం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో వరదనీరు వృథాగా బయటికి వెళ్లిపోయింది. గతంలో 2005లో కూడా చెరువుకు గండి పడినా అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టడం వల్లే మరోసారి తెగిపోయింది. చెరువుకట్ట తెగిపోయి వరద నీరంతా బయటికి పోయాక గురువారం ఉదయం ఇరిగేషన్ జేఈ మనోజ్‌కుమార్, సిబ్బందితో కలిసి ముద్దినాయనపల్లి చెరువును పరిశీలించారు. తెగిపోయిన చెరువు కట్టను పరిశీలించారు. అనంతరం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

వర్షాలు వస్తే సంబరపడ్డాం



భారీ వర్షాలు కురుస్తుంటే సంబరపడ్డాం. కానీ సంతోషం ఒక్క రోజే ఆవిరయ్యింది. చెరువుకు గండి పడినచోట వరద ధాటికి చెరువు కట్ట మొత్తం తెగిపోయింది. వర్షపునీరంతా బయటకు పోయింది. చెరువులో నీరుంటే బోర్లలో నీటిమట్టం పెరిగి సాగుకు ఇబ్బంది ఉండేది కాదు.

– చిన్న ఓబుళప్ప, రైతు, ముద్దినాయనపల్లి

నీరంతా పోయాక వస్తే ఏం లాభం



సుమారు ఏడాదికి సరిపడా నీళ్లు చెరువులోకి వచ్చాయి. చెరువు కట్ట తెగిపోయి నీళ్లన్నీ బయటికి పోయాయి. అధికారులు ఇప్పుడు వచ్చి కట్ట వేస్తామంటున్నారు. ఇప్పుడు చేసి ఏం లాభం. పెద్ద వర్షాలు మరీ వస్తాయో లేదో...పెద్ద ఎత్తున వాన నీరు చెరువుకు వచ్చి చేరుతుంటే చాలా సంతోషం వేసింది. ఇదంతా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగింది.

– నరసింహులు, రైతు, వెంకటంపల్లి

తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నాం

ముద్దినాయనపల్లి చెరువుకు గండి పడిన విషయం గ్రామస్తుల ద్వారా తెలిసింది. చెరువు సుమారు 108 ఎకరాల్లో ఉంది. దాదాపుగా 23 మిలియన్ ఘనపు అడుగుల లోతు ఉంది. అయితే సాయంత్రం సమయంలో గండి పూడ్చేందుకు వీలుకాలేదు. చెరువు తెగిన చోట తాత్కాలికంగా యంత్రాలతో మరమ్మతులు చేయిస్తున్నాం. కేవలం చెరువులో కంపచెట్లు, బొరియలు ఏర్పడటంతోనే తెగిపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేశాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతాం.

– మనోజ్‌కుమార్, జేఈ, ఇరిగేషన్, కళ్యాణదుర్గం

ప్రభుత్వ సేవలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

కళ్యాణదుర్గం: పట్టణాలకు సమీపంలో ఉండేవారే కాక, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివ ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం మండల పరిధిలోని నుసికొట్టాల తండాలో న్యాయ సేవలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నేటికీ పథకాలు తెలియని పరిస్థితి ఉందన్నారు. పట్టణ సమీపంలోని పల్లెలతో పోల్చుకుంటే మారుమూల గ్రామాలలో పరిస్థితి వ్యత్యాసంగా ఉందన్నారు. దీని వల్ల మారుమూల గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయ సేవలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉచితంగా న్యాయ సేవలను ఎలా పొందాలన్న విషయాలపై జడ్జి తెలియజేశారు. అనంతరం అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ సేవలు, పథకాల అమలుపై ప్రజలకు వివరించారు. అనంతరం జడ్జిని వివిధ శాఖల అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, ఎంపీడీఓ సాలమాన్, ఎంఈఓ బాబు, హౌసింగ్ ఏఈ లోక్‌నాథ్ చౌదరి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిరుపాల్ నాయక్, పీఆర్ ఏఈ కిశోర్, మెడికల్ ఆఫీసర్ విజయేంద్ర, సబ్ డివిజనల్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్ పాల్గొన్నారు.

శుభకార్యం


వధూవరులతో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని కలగళ్లకు చెందిన బ్రాంచ్ పోస్టుమాస్టర్ రమణా రెడ్డి కుమారుడు తేజవర్ధన్ రెడ్డి వివాహం ప్రశాంతితో గురువారం పామిడిలో జరిగింది. కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత రమణ, జిల్లా నేత వీరన్న, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ట్రాఫిక్ కష్టాలు


కళ్యాణదుర్గం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు, వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బళ్లారి రోడ్డు నుంచి వాల్మీకి సర్కిల్ వరకు, గాంధీ చౌక్ మేడా వీధిలో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు. ప్రధానంగా పట్టణంలో భారీ వర్షాలకు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. మేడావీధిలో గతంలో రోడ్డు విస్తరణలో భాగంగా పూర్తిగా నిర్మాణాలు, కట్టడాలను తొలగించలేదు. దీంతో ఇరువైపులా భవనాల మెట్లు, కట్టలు నిర్మించుకోవడంతో వీధులు ఇరుకుగా మారాయి. దీంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

మీ సమస్యలు నిర్భయంగా తెలియజేయండి



ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్

కళ్యాణదుర్గం: మీ సమస్య ఏదైనా నిర్భయంగా ఇందులో వేయండి....మాకు తెలిపితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత ప్రజలకు భరోసా ఇస్తున్నారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయం లోపలికి వెళ్లగానే కుడివైపు పెద్ద ఇనుప ట్రంకు బాక్సు కనిపిస్తోంది. ఇందులో ప్రజల సమస్యలు, కార్యాలయంలో పొందిన సేవలపై అభిప్రాయాలను తెలియజేయాలని ఇనుప బాక్సును ఏర్పాటు చేశారు. ఏ సమస్యనైనా చెప్పలేని స్థితిలో ఉంటే బాక్సులో వేయాలని కోరారు. అదే సందర్భంలో కార్యాలయం నుంచి 'మీ సమస్య పరిష్కారం అయి సంతృప్తి పొందితే సేవలపై తమ అభిప్రాయాలను తెలియజేయండి ' అని చెప్పారు. ఎన్నడూలేని విధంగా ఇలా కార్యాలయం వద్ద ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

గృహం..గ్రహణం

- పక్కా గృహాల నిర్మాణాలకు బ్రేక్
- ప్రభుత్వం మార్పుతో ఆందోళనలో లబ్ధిదారులు
- నియోజకవర్గ వ్యాప్తంగా 5,634 గృహాలు మంజూరు
- 2,743 గృహాల నిర్మాణాలు పూర్తి
- వివిధ దశలలో 2,891 గృహాలు
- కొత్త ప్రభుత్వం నిర్ణయంపై లబ్ధిదారులు ఎదురు చూపులు


కంబదూరులో పూర్తి కావాల్సిన ఇళ్ల నిర్మాణాలు

కంబదూరు: ప్రతి ఒక్కరికీ సొంతింటి కల ఉంటుంది.. పేదల ఆశకనుగుణంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హత ఉంటే చాలు.. ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించారు. దీంతో ఎంతో మంది సొంతింటి కల సాకారమైందని సంబరపడ్డారు. అయితే కొందరు ఇళ్లు నిర్మించుకోవడంలో ఆలస్యం చేయగా, సగంలో నిలిచిపోయాయి. అదే సమయంలో ఎన్నికల కోడ్, ఆ తర్వాత ప్రభుత్వం మారిపోవడంతో పూర్తి కాని ఇళ్లకు బిల్లులు వస్తాయోలేదో.. సర్కారు ఏం చేస్తుం దో తెలియక ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. ఫలి తంగా గూడులేని పేదలకు సొంతింటికలకు గ్రహణం పట్టినట్లయ్యింది.

కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 35 జగనన్న లేవుట్‌లను ఏర్పాటు చేసి 5,634 పక్కా గృహాలను మంజూరు చేసింది. హౌసింగ్ అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రభుత్వం కూడా సకాలంలో బిల్లులు అందజేయంతో 2,743 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 2,891 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులల్లో ఆందోళన మొదలైంది. ఇంటి నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయా? రావా అన్న ఆలోచనలో పడ్డారు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు పూర్తిగా బ్రేక్ పడింది.

బిల్లులు చెల్లిస్తామంటే నిర్మించుకుంటాం



గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలు చేపట్టగానే సకాలంలో బిల్లులు అందేవి. దీంతో వేగంగా టాప్ లెవెల్ వరకు ఇంటిని నిర్మించుకున్నాం. కొత్త ప్రభుత్వం ఏర్పాడడంతో బిల్లులు రావేమోనన్న అనుమానంతో ఇంటిని నిర్మాణాన్ని ఆపేశాం. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు ఇస్తామంటే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంటాం.

– సుభాషిణి, కంబదూరు

బిల్లులు రావనే భయం



ప్రభుత్వం మారడంతో అప్పటి ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు రావనే భయంతోనే ఇంటిని కట్టుకోకుండా వదిలేశాం.కొత్త ప్రభుత్వం ఇంటి బిల్లులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురు చూస్తున్నాం.పేదలమైన మాకు ఇంటి నిర్మాణం భారంగా ఉంది. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంటి బిల్లులను చెల్లించాలి. అలా ఇస్తే వేగంగా ఇంటిని నిర్మించుకుంటాం.

– రేఖ, కంబదూరు

ఆందోళన చెందాల్సిన పనిలేదు



ప్రభుత్వం మారింది..ఇంకా బిల్లులు రావేమోనని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులందరికీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లిస్తుంది. జిల్లా కలెక్టర్ కూడా వంద రోజుల్లో ఇంటి నిర్మాణాలన్నీ పూర్తయ్యేలా చూడాలని టార్గెట్ విధించారు. స్థానిక ఎమ్మెల్యే కూడా పేదలు కట్టుకునే ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు ఇస్తుందని, ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు వేగంగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

– రామకృష్ణ, హౌసింగ్ ఏఈ, కంబదూరు

తీరనున్న గ్రాసం కొరత


బీడు భూమిలో పచ్చిగడ్డి మేస్తున్న గొర్రెలు

కూడేరు: మండలంలో గత వారం రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో భూముల్లో గ్రాసం పచ్చబడతోంది. దీంతో మూగజీవాలకు ఊరట లభిస్తోంది. మండలంలో సుమారు 30 వేలు వరకు గేదెలు, ఎద్దులు, ఆవులు, సుమారు 90 వేలు వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వర్షం రాకతో మూగజీవాలకు గ్రాసం కొరత తగ్గడంతో పశుపోషకులు, రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

గుండెపోటుతో యువకుడు మృతి

బొమ్మనహాళ్: సింగానహళ్లిలో నవీన్ (22) గుండెపోటుతో మృతిచెందాడు. నవీన్‌కు బుధవారం అర్ధరాత్రి ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యు లు అతన్ని బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు నవీన్‌కు మూడు నెలల క్రితమే కణేకల్లు మండలం బేణేకల్లుకు చెందిన నందినితో వివాహమైంది.

ఆటో బోల్తాపడి ఐదుగురికి గాయాలు



గాయపడిన వన్నూరమ్మ, డ్రైవర్ తిప్పేరుద్ర

రాయదుర్గం టౌన్: పట్టణ శివారు అడిగుప్ప రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తా పడి ఐదుగురు కూలీలకు గాయాలయ్యాయి. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మహిళా కూలీలు, డ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులందరూ గుమ్మఘట్ట మండ లం శిరిగేదొడ్డి గ్రామవాసులు. కూలి పనుల నిమిత్తం ఆరుగురు ఆటోలో బయల్దేరారు. అడిగుప్ప రోడ్డులోని ఓ తోటకు వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. వన్నూరుమ్మ, తిప్పేరుద్రకు తీవ్రంగా గాయాలు కా గా, రాజమ్మ, లక్ష్మీ, కమలమ్మకు స్వల్ప గాయాలయ్యా యి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

గుమ్మఘట్ట: మండలంలోని అడిగుప్ప రోడ్డులో ఆటో అదుపు తప్పి బోల్తాపడి ఆరురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. గురువారం సిరిగెదొడ్డికు చెందిన 9 మంది కూలీలు వ్యవసాయ పనులు చేసేందుకు ఆటోలో బయల్దేరారు. మార్గం మధ్యలోని అడిగుప్ప క్రాస్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న తిప్పేరుద్ర, కమలమ్మ, రాధమ్మ, వన్నూరక్క, మారెక్క ,లక్ష్మీ గాయాలపాలయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: బొలెరొ బైక్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని దాసంపల్లికి చెందిన తిరుమలేష్ తన స్నేహితుడు తిమ్మరాజు కలిసి గురువారం తమ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వెళ్తుండగా కుర్లపల్లి గ్రామం వద్ద బొలెరొ వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో తిరుమలేష్‌కు కాలు విరిగింది. తిమ్మరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గ్రామసభలు

కూడేరు: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపుకుగాను కూడేరు మండలంలోని 14 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ తులసీ ప్రసాద్ గురువారం తెలిపారు.

జాగ్రత్తలతోనే చీడపీడల నివారణ


షెక్షానుపల్లిలో వేరుశనగ పరిశీలిస్తున్న ఏఓ శుభకర్

ఉరవకొండ: ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయని, అధిక వర్షానికి పంటలకు చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు పాటించాలని ఏఓ శుభకర్ తెలిపారు. గురువారం మండలంలోని కోనాపురం, షెక్షానుపల్లి గ్రామాల్లో వేరుశనగ, కంది పంటలను ఆర్‌బీకే సిబ్బందితో కలిసి ఏఓ పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది చిక్కన్న, గోపాల్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కుందిర్పి: మండలంలోని బెస్తరపల్లి సమీపంలో పేకాట స్థావరంపై గురువారం దాడి చేసినట్లు ఎస్‌ఐ ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. నలుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.17వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో 15 మంది పేకాటరాయుళ్లు పరారైనట్లు తెలిపారు.

పంట నమోదు చేయించుకోవాలి

కంబదూరు: ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, ఇతర ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రైతూ తప్పకుండా ఈ-క్రాప్ నమోదు చేయించాలని ఉద్యానవన శాఖ అధికారిణి గౌసియా బీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, రాయితీలతో పాటు అన్ని రకాల ప్రయోజనాలు పొందాలంటే తప్పకుండా ఈ క్రాప్ నమోదు చేయించాలన్నారు. సెప్టెంబర్ 15 లోపు రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు చేయించాలన్నారు.

కోల్‌కతా ఘటన అమానుషం


శెట్టూరులో ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

శెట్టూరు: కోల్‌కతా ఘటన అమానుషమని డాక్టర్ తరుణ సాయి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోగ కేంద్రంలో వైద్య సిబ్బంది నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్ వైజర్ లలితవతి, ఎంఎల్‌హెచ్‌పీలు మౌనిక, అంజలి, శిరీష, అకిల, నమృత పాల్గొన్నారు.